క్లుప్తంగా

నల్లపోచమ్మకు పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి శ్రీనల్లపోచమ్మకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం దేవాదాయశాఖ ఉమ్మడిజిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేశ్ శ్రీనల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోశారు. కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కులను అందజేస్తున్న రాజిరెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జక్కపల్లికి చెందిన లక్ష్మి, నర్సాపూర్‌కు చెందిన శేఖర్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సుధీర్‌గౌడ్, హరీశ్ వర్దన్ తదితరులు ఉన్నారు.

చిన్నారులను అలరించిన ఎడారి ఓడ



ఒంటెను ఆసక్తిగా చూస్తున్న చిన్నారులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో చిన్నారులను ఎడారి ఓడ అలరించింది. ఆదివారం మెదక్ వైపు నుంచి హైదరాబాద్ వెలుతూ కౌడిపల్లి గ్రామంలోని పలు కాలనీలలో ఒంటె తిరిగింది. ఒంటెను చూడగానే చిన్నారులు సందడి చేశారు. ఒంటె వెంట ఉన్న కాపరి చిన్నారులను ఎక్కించి అటు ఇటు తిప్పి సవారీ చేయించారు.

ఘనంగా గణిత దినోత్సవం



పెద్దశంకరంపేటలో గణిత దినోత్సవం

పెద్దశంకరంపేట(మెదక్): గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయా పాఠశాలల్లో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక సంస్కార్ విద్యాలయంలో గణితశాస్త్ర ప్రదర్శన, విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధు, బీజేపీ మండల అధ్యక్షుడు కోనం విఠల్, నాయకులు నారాగౌడ్, రాజన్‌గౌడ్, దాచ సంగమేశ్వర్, రాజశేఖర్, కరస్పాండెంట్ సీతారాం, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

దుబ్బాకటౌన్: డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని రాయపోల్ ఇన్‌చార్జి ఎస్ఐ మహిపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కిరాణా దుకాణాలలో నార్కోటిక్ డాగ్స్‌తో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు.

కొనసాగుతున్న సర్వే

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ఆదివారం ఆయా గ్రామాలలో గ్రామకార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారుల ఇళ్ల వివరాలు, ఫొటోలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. యాప్‌లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తుండటంతో ఆయా గ్రామాలలో సిగ్నల్ సమస్యల వల్ల సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

అల్లాదుర్గం(మెదక్): అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని అంబేడ్కర్ స్టడీ సర్కిల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం అల్లాదుర్గంలో విలేకరులతో మాట్లాడుతూ కీలకమైన పదవిలో ఉండి అలా మాట్లాడం అవివేకమన్నారు. భారతరత్న అంబేడ్కర్ ప్రతి భారతీయునికి చెందినవాడన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బాలరాజ్, అశోక్, కుమార్, సాయిలు పాల్గొన్నారు.

మహాలక్ష్మి మాకేది?

- మహిళలకు అందని లబ్ధి
- వెల్దుర్తి మండలం పలు గ్రామాల్లో నడవని బస్సులు
- చేసేది లేక ఆటోల్లోనే ప్రయాణం
- మితిమీరిన వేగంతో ప్రాణసంకటం
- పట్టించుకోని అధికారులు

వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో మహాలక్ష్మి లబ్ధిని పొందలేకపోతున్నారు. పలు రూట్లలో బస్సు లేక మహిళలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోందని లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉంటే సర్వీసులు లేని రూట్లలో బస్సులు నడపాలని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు.



ఆటోలో పరిమితికి మించి వెళ్తున్న ప్రయాణికులు

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలో పరిమితికి మించి ఆటోలు ప్రయాణికులతో ప్రయాణిస్తున్నాయి. పలు గ్రామాలకు బీటీ రోడ్డు ఉన్నా ఆర్టీసీ సౌకర్యం లేక ప్రయాణికులు ఆటోలపై ప్రయాణానికే మొగ్గ చూపుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలో బస్‌డిపో ఏర్పాటైన బస్సుల సంఖ్య పెరగలేదు. మండలంలోని పలు రూట్లలో బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లినా, మెదక్, మేడ్చల్ డిపో మేనేజర్ల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు సర్వీసుకు దూరం అవుతున్నారు.

నిబంధనలు బేఖాతరు..

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని నిబంధనలున్నా వాహనదారులు బేఖాతరు చేస్తున్నారు. ఒక్కొక్క ఆటోలో సుమారు 15 నుంచి 20 మందిని ఎక్కిస్తున్నారు. దీంతో డ్రైవర్ ఎటు వైపు తిప్పాలన్నా ఇబ్బందే. మైనర్లతో పాటు కొందరు లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. మండలంలోని యశ్వంతరావుపేట, ధర్మారం, అందుగులపల్లి, కొప్పులపల్లి, ఏదులపల్లి, రామేపల్లి, మంగళపర్తి, జలాల్‌పూర్, అచ్చంపేట తదితర గ్రామాలతో పాటు నర్సాపూర్, మెదక్, తూప్రాన్, శివ్వంపేట తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఆటోల మీదే ఎక్కువగా ఆధార పడుతుంటారు.

> **తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నాం**
>
> 
>
> ఆటోలు మితిమీరిన వేగం వల్ల ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నాం. బస్సులు సమయానికి రాక, తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆటోలపై నియంత్రణకు చర్యలు చేపట్టాలి.
>
> – శంకరయ్య, హకింపేట

ప్రమాదం జరిగినప్పుడే హడావిడి

ఎక్కడైనా ప్రమాదం జరిగినప్పుడు పోలీసులు, ఆర్టీఏ అధికారులు దాడులు చేస్తూ నాలుగైదు రోజులపాటు హడావిడి చేయడం సర్వసాధారణమైంది. అనంతరం అధికారులు మిన్నకుండి పోవడంతో యథావిధిగా ఆటో, ట్రాక్టర్ డ్రైవర్‌లు అధిక సంఖ్యలో ప్రయాణికులు, కూలీలను తీసుకెళ్తున్నారు. అధిక సంఖ్యలో కూలీలను ఎక్కించుకొని కాలువ, చెరువు కట్టల వెంట ప్రమాదకరమైన రోడ్ల వెంట ప్రయాణిస్తుంటారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు ప్రయాణికులతో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కాంగ్రెస్ నాయకులు ఎలా ప్రారంభిస్తారు ?

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌ను కాంగ్రెస్ నాయకులు ఎలా ప్రారంభిస్తారని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. ఆదివారం నార్సింగి బీజేపీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శిర్న చంద్రశేఖర్ మాట్లాడుతు ప్రజల చేత ఎన్నికైన ఎమ్మెల్యే, ఎంపీలు ప్రారంభించాల్సిన ప్రభుత్వ కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మెదక్ ఎంపీ కార్యక్రమానికి వస్తారని తెలిసి అంబులెన్స్‌ను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేసీ చర్యలు చేపట్టాలని కోరారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధరిపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన బీరప్ప, మహంకాళి ఆలయ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ధరిపల్లి గ్రామంలో బీరప్ప, మహంకాళి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠ చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శ్రీనాథ్‌శర్మ ఆధ్వర్యంలో చండీహోమం, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నప్రసాదం అందించారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

- పాల్గొన్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): స్వాముల శరణుఘోష మధ్య చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లిలో అయ్యప్ప మహాపడి పూజ వైభవంగా జరిగింది. ఆదివారం మాజీ ఎంపీపీ అరుణప్రభాకర్ కుమారుడు సాయిచరణ్ కన్నెస్వామి ఆధ్వర్యంలో ఈ పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ ఆధ్యాత్మికతకు ప్రతిరూపం అన్నారు. అంతకు ముందు చిన్న శంకరంపేటలోని అయ్యప్ప ఆలయం వద్ద మాజీ వార్డు సభ్యుడు సందీప్‌స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో పాల్గొన్నారు. గురుస్వాములు కృష్ణమూర్తి, కృష్ణాగౌడ్, నరేందర్, రంగారావు, రమేశ్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, శ్రీమన్‌రెడ్డి, రాజిరెడ్డి, సురేందర్ నాయక్ పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రారంభమైన బంగారమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి తిమ్మాపూర్ గ్రామంలో బంగారమ్మ జాతర మహోత్సవం ఆదివారం ప్రారంభమైంది. తొలిరోజు అడవిలో కొలువైన బంగారమ్మ ఆలయం వద్ద గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వంటవార్పు చేపట్టి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయపూజారులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం గ్రామంలో కొలువైన లింగమయ్యకు, మంగళవారం ఎల్లమ్మ తల్లికి భక్తులు బోనాలు సమర్పిస్తారు. బంధువుల రాకతో గ్రామంలోని ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఎమ్మెల్యే పూజలు

బంగారమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఆలయాభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు అశోక్‌గౌడ్, అంజగౌడ్, హర్యానాయక్ తదితరులున్నారు.



బంగారమ్మతల్లికి ఒడిబియ్యం సమర్పించిన భక్తులు

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): సమగ్ర శిక్షా ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని పీఆర్‌టీయూ కౌడిపల్లి మండల ప్రధాన కార్యదర్శి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తూ విద్యావ్యవస్థ బలోపేతానికి ఉద్యోగులు కీలకపాత్ర వహిస్తున్నారని చెప్పారు. వారిని ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పీఎఫ్, ఆరోగ్య బీమా సౌకర్యాన్ని సైతం కల్పించాలని డిమాండ్ చేశారు.



రమేశ్, పీఆర్‌టీయూ నేత

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

రామాయంపేట(మెదక్): డలంలోని ప్రగతి ధార్మారంలో ఆదివారం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని మాల సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, సాయంత్రం బోనాల ప్రదర్శన నిర్వహించారు. శివసత్తుల ప్రదర్శనతో సందడి నెలకొంది. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



ఆలయం వద్ద భక్తుల సందడి

ధనుర్మాస పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు తెల్లవారుజామున స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గుట్టపై కొలువైన స్వామివారిని కాలినడక వెళ్లి దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి. జూనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి ఉన్నారు.

ఘనంగా ఆరట్టు ఉత్సవం



పాపన్నపేటలో ఆరట్టు ఉత్సవం నిర్వహిస్తున్న మాలధారులు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్నపేటలో ఆదివారం అయ్యప్ప స్వామి ఆరాట్టు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి తెల్లవారు జామున పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆభరణాలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉత్సవ విగ్రహాన్ని వాహనంలో ఉంచి, ,వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మాలాధారులు నృత్యాలు చేశారు. స్థానిక చెరువు వద్ద స్వామి వారికి చక్ర స్నానం చేయించారు.

నర్సాపూర్ మీదుగా గవర్నర్



నర్సాపూర్ మీదుగా వెళ్తున్న గవర్నర్ కాన్వాయ్

నర్సాపూర్: ఆదివారం మెదక్, కొల్చారంలలో పర్యటించేందుకు గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ నర్సాపూర్ మీదుగా వెళ్లారు. ఆయన కాన్వాయి వచ్చే ముందు పోలీసులు రోడ్లపై ఇతర వాహనాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. కాగా కార్యక్రమాలు ముగిసిన అనంతరం సైతం ఆయన నర్సాపూర్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



అర్జున్, అధ్యక్షుడు



శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా అర్జున్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షురాలు స్వప్న, కోశాధికారి ప్రదీప్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా రవీందర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు అర్జున్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సమస్యలు పరిష్కారానికి నిరంతరం సంఘం పోరాడుతుందన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మనోహరాబాద్(తూప్రాన్): పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కాళ్లకల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరసింగం అన్నారు. ఈ మేరకు ఆదివారం గ్రామంలోని పలువురు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు అందజేశారు. ముఖ్యంగా సమయం వృథా చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పరీక్షలు ముగిసేవరకు టీవీలు, ఫోన్లకు విద్యార్థులను దూరంగా ఉంచాలన్నారు.



విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం నరసింగం

చాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



గర్భగుడిలో కొలువైన అమ్మవారు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం చిలప్‌చెడ్ మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరీ అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు. ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

ఎల్‌ఓసీ అందజేత

కౌడిపల్లి(నర్సాపూర్): బాధిత కుటుంబసభ్యులకు ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి రూ. లక్ష ఎల్‌ఓసీని అందజేశారు. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన వడ్ల మహేశ్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు దానిని ఇచ్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సంత.. సౌకర్యాల చింత



తూప్రాన్‌లో చెరువు కట్టపై పశువుల సంత

- తూప్రాన్ పశువుల అంగడిలో వసతుల లేమి
- ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

తూప్రాన్: పాలకుల నిర్లక్ష్యంతో పశువుల అంగడి అధ్వానంగా మారింది. కనీస సౌకర్యాలు కల్పించే నాథుడు లేక ఉనికి కోల్పోయే పరిస్థితి దాపురించింది. గతంలో తూప్రాన్ పశువుల అంగడి ఎంతో పేరుగాంచింది. ఇక్కడ అన్నిరకాల పశువులు లభిస్తాయని వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది రైతులు వచ్చేవారు. ప్రస్తుతం కనీస వసతులు కరువై వెలవెలబోతుంది. తూప్రాన్ డివిజన్ కేంద్రంలో ప్రతి మంగళవారం చెరువు కట్టపై పశువుల సంత జరుగుతుంది. పక్క జిల్లాలైన వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి వచ్చిన రైతులు, వ్యాపారులు ఇక్కడ పశువుల క్రయవిక్రయాలు జరుపుతుంటారు. ఏటా వేలం పాట ద్వారా రూ. లక్షలు పురపాలక సంఘానికి సమకూరుతోంది. అయితే రైతులకు సౌకర్యాలు కల్పించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుత సంవత్సరంలో పశువుల సంత నిర్వహణ కోసం రూ. 2.40 లక్షల ఆదాయం వేలం పాట ద్వారా వచ్చింది. కాగా పురపాలక సంఘానికి ఆదాయం వచ్చేలా ఆలోచన చేస్తున్న పురపాలక సంఘం అధికారులు సుదూర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చిన వారికి కనీసం తాగునీటి సౌకర్యం కల్పించడంలో విఫలమవుతున్నారు. కనీసం మరుగుదొడ్లు కరువయ్యాయి. షెడ్డు లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రైతులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం పశువులకు తాగునీటి కోసం నీటి తొట్లు కూడా కానరావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస వసతులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> పశువుల సంతలో సౌకర్యాలు లేని విషయం వాస్తవమే. రెవెన్యూ అధికారుల సహకారంతో సంతకు అనువైన స్థలాన్ని గుర్తిస్తాం. రైతులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.
>
> – గణేష్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్, తూప్రాన్